మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

తూ చందా మై చాంద్‌నీ.

తూ తరువర్ మై శాఖ్ రే

తూ బాదల్, మై బిజురీ

తూ పంఛీ, మై పాఖ్ రే...

హిందీ చలన చిత్ర గీతాలలో అత్యద్భుతమైన పది గీతాలను ఎన్నుకోమంటే, ఎవరు ఎన్నుకున్నా తప్పని సరిగా ఆ జాబితాలో ఉండే గీతం 'రేష్మా ఔర్ షేరా' సినిమాలో బాలకవి బైరాగి రచించగా, జయదేవ్ సంగీతం సమకూర్చిన ఈ లతామంగేష్కర్ పాడిన పాట!

కొన్ని పాటలు వింటూంటే ఆయా గేయ రచయితలు, సంగీత దర్శకులు ఎలా పాటలను సృజించారో అన్న ఆశ్చర్యం కలుగుతుంది. ఆ సమయంలో వారి నడుమ జరిగిన సృజనాత్మక చర్చలు, చర్చించుకుని వదిలేసిన ఆలోచనలు, అనుకుని ఆనందించి ఆ పై కాదనుకున్న బాణీలు, పదాలు ఎంచుకున్న విధానం వంటివి తెలుసుకోవాలన్న తీవ్రమైన తపన కలుగుతుంది. ఆ సమయంలో సరస్వతీ దేవి కరుణాకటాక్ష కిరణాలు వారిపై ప్రసరించి ఎలా వారి ఆలోచనల దిశను ప్రభావితం చేశాయో గ్రహించాలన్న కోరిక దహించి వేస్తుంది. ఎందుకంటే అలాంటి పాటల్లో ప్రతి పదం, ప్రతి స్వరం, ప్రతి లయ, ఎంత చక్కగా కుదురుతాయంటే, అలాంటి పర్‌ఫెక్షన్ మామూలు మానవ ప్రపంచంలో సంభవం కాదు. ఇంతటి అత్యుత్తమ స్థాయి సృజన గంధర్వలోకం దాటి దేవలోకంలోనే సాధ్యం. ఆకాశంలోని గంగను భూమికి దింపి ప్రవహింపచేసిన భగీరథుడిలా, ఈ కళాకారులు ఏ తపస్సు చేసి దేవలోకానికి చెందిన ఈ స్వర తరంగాలను, భూమిపై వినిపించి, మానవుల శ్రవణ స్థాయిని దైవలోక స్థాయికి ఎదిగింప చేశారా అన్న ఆశ్చర్యం కలుగుతుంది.

సంగీతం లేకుండా సాహిత్యం, సాహిత్యం లేకుండా సంగీతం స్వతంత్రంగా అస్తిత్వం కలిగి ఉన్నా, సంగీత, సాహిత్యాల మేలు కలయిక మరింత ఉత్కృష్టమైన అంబరాన్ని తాకే అలగా ఎగుస్తుంది. తనతోపాటూ వింటూన్న శ్రోతలకూ అలౌకికానంద అంబరాలలో విహరింపచేస్తుంది.

'రేష్మా ఔర్ షేరా' రాజస్థాన్‌కు సంబంధించిన కథ. పంతాలు, పట్టుదలలు, తీవ్రమైన ప్రేమలు, అదుపులేని ఆత్మగౌరవం, హింసకు వెనుదీయని తెగింపు వంటివి రాజపుత్రుల స్వభావాలు. రెండు తీవ్రమైన విద్వేషాలున్న తెగలకు చెందిన యువతీ యువకుడు ప్రేమించుకుంటారు. ఆ పంతాలు, పట్టింపులు, కుటుంబ గౌరవాలు, ద్వేషాలు హింసల నడుమ రేష్మా, షేరాల ప్రేమవల్ల చెలరేగిన పరిణామాలు సినిమా కథ. చుట్టూ చెలరేగుతున్న విద్వేషాల తుపాను నడుమ విరబూసిన ప్రేమ పుష్పం కావటంతో వీరిద్దరికీ కలిసే అవకాశాలు తక్కువ. చాలా అరుదుగా లభిస్తుంది కలిసే అవకాశం. పైగా వారి ప్రేమ ఫలవంతం అవటం కూడా కుదరని పని అని వారిద్దరికీ తెలుసు. ఎందుకంటే, రేష్మ తండ్రిని షేర తమ్ముడు చంపేస్తాడు. దాంతో తమ్ముడిని చంపటం ద్వారా శాంతి సాధించాలని షేర ప్రయత్నిస్తాడు. అతడిని కాపాడేందుకు తాను ప్రేమించిన వ్యక్తి తమ్ముడినే రేష్మ పెళ్లి చేసుకుంటుంది. దాంతో 'పగ'లు తీరిపోయాయి. కానీ తన ప్రేయసిని తాను ఎన్నటికీ పొందలేడని గ్రహించి షేర ఆత్మహత్య చేసుకుంటాడు. అది చూసి అతని శవం మీద పడి ప్రాణాలు విడుస్తుంది రేష్మ. టూకీగా, ఇది విషాదాంత రేష్మ షేర్ ల విషాద ప్రేమ గాథ. ఇలాంటి ప్రేమ గాథలు హిందీ సినిమాల్లో కోకొల్లలు. కానీ, ఈ సినిమాను ఇతర ఇలాంటి సినిమాలకు ప్రత్యేకంగా నిలుపుతాయి ఈ సినిమా పాటలు.

ఈ విషాద ప్రేమ గాథకు సాక్షిగా నిలుస్తుంది ఎడారి. అంటే, సినిమాలో 'ఎడారి' ఒక ప్రధాన పాత్ర అన్నమాట. సినిమా కథ చెప్పటం ఎందుకంటే, ఈ పాట మొత్తం సినిమా కథను ప్రతిబింబిస్తుంది. ప్రేమ గీతం అయినా ప్రేమ వర్తమాన, భవిష్యత్తులను చూపిస్తుంది. పాటలో ఒకో స్వరం ఎంతో ప్రతిభావంతమై దృశ్యాన్ని దర్శింపచేస్తుంది. పదాలు ప్రతిబింబించే భావాన్ని ఇనుమడింపచేస్తుంది. ఇక ఆ పాటలో 'బాలకవి బైరాగి' పదాలను ఎంపికచేసి మరీ వాడినట్టు తోస్తుంది. ఒకో పదం పలు విభిన్నమైన భావాలు కలిగిస్తుంది. ఒకవైపు నాయికా నాయకుల నడుమ ఉన్న ప్రేమను వివరిస్తూనే, మరోవైపు భవిష్యత్తులో జరగబోయేదాన్ని సూచనప్రాయంగా ప్రదర్శిస్తాయి. పాట చిత్రీకరణ కూడా అత్యుత్తమ స్థాయిలో ఉంటుంది.

శాంతంగా, నిశ్శబ్దంగా సూర్యాస్తమయమవుతుంది. ఇసుక తిన్నెలు అలల్లా అనంతంగా పరుచుకుని ఉంటాయి. ఇసుక తిన్నె పైకి ఎక్కుతూంటే అది ఎంత లోతుందో ఊహించటం కష్టం. ఆ లోయలో ఉన్నది కనబడదు. అలాంటి ఇసుక తిన్నెల వరుసలలో ఓ లోయలో ప్రియుడు అక్కడ ఉన్నాడనటానికి సూచనగా నిప్పు వెలుగుతూ కనిపిస్తుంది. దాంతో

ఇంట్లో వాళ్లకి తెలియకుండా నెమ్మదిగా ఇసుకలో అడుగులు వేస్తూ నాయిక నాయకుడిని కలిసేందుకు బయలుదేరుతుంది. వారిద్దరి ప్రేమ సమాగానికి సాక్షులు ఇసుక రేణువులు. ఎంత జాగ్రత్తగా ఆమె అడుగులు వేసినా కాళ్లకున్న గజ్జెలు ఘల్లు ఘల్లుమంటూంటాయి. ఘల్లు ఘల్లుమనే గజ్జెల లయతో, గాలికి కదిలే ఇసుక రేణువుల లయకు స్పందిస్తూ సంతూర్ స్వరం జత కలుపుతుంది.

పాట ఆరంభానికి ముందు వచ్చే లయబద్ధమైన గజ్జెల శబ్దం లయకు తగ్గట్టు వినిపించే సంతూర్ వాయిద్య ధ్వనులు పాట మూడ్‌ను స్థిరపరుస్తాయి. నాయకుడిని కలవాలన్న నాయిక తీవ్ర ప్రేమకు స్వరమిస్తాయి. పరుగున వెళ్తున్న నాయిక ఆగుతుంది. చుట్టూ చీకటి. ఆమె ఆగటంతో గజ్జెల చప్పుడు ఆగుతుంది. ప్రవహిస్తున్న సంతూరాగిపోతుంది. ఆ నిశ్శబ్దంలో హృదయ లోతుల్లోంచి నాయిక స్వరం వినిపిస్తుంది. అలౌకికానందం కలిగిస్తుంది.

అతడు చంద్రుడు. ఆమె వెన్నెల. అతడు వృక్షమైతే, ఆమె శాఖలు. అతడు మేఘమైతే, ఆమె మెరుపు. అతడు పక్షి అయితే, ఆమె రెక్కలు. ఒకరు లేకుండా మరొకరుండలేని, ఒకరినొకరు విడలేని, విడదీయరాని అత్యంత తీవ్రమూ, ప్రాకృతము అయిన వారి ప్రేమను ఆమె తన పాటలో పల్లవి ద్వారా ప్రదర్శిస్తోంది. వారి విడదీయరాని అనుబంధాన్ని సూచించేందుకు బాలకవి బైరాగి వాడిన ప్రతీకలు ఎంత ప్రాకృతికమో అంత స్వచ్ఛమూ. ఎలాగయితే కాళిదాసు పార్వతీ పరమేశ్వరుల ప్రేమను సూచించేందుకు వాక్కును, అర్ధంను వాడాడో అలాగే ఒకటి లేకపోతే మరొకదానికి, అర్ధం, అస్తిత్వం ఉండని ప్రతీకలను వాడాడు బాలకవి బైరాగి. సినిమా చివరలో, ఆమె లభించదని గ్రహించి నాయకుడు ఆత్మహత్య చేసుకుంటాడు. వెన్నెల లేని చంద్రుడికి అర్ధం ఏముంది?

చంద్రుడు లేకపోతే వెన్నెల ఉంటుందా? అందుకే అతను మరణించిన మరుక్షణం, ఆమె ప్రాణత్యాగం చేస్తుంది. అత్యద్భుతమైన గేయ రచన సంవిధానం ఇది.

బాలకవి బైరాగి అతి తక్కువ సినిమా పాటలు రాసినా, ఆయన రాసిన పాటలన్నీ సాహిత్య పరంగా అత్యుత్తమ స్థాయి, నాణ్యతలు కలవి. 'కవి' గా ఆయన ఎంతో పేరు ప్రఖ్యాతులు సాధించాడు. హింది కవిత్వంలో బాలకవి బైరాగి రాసిన 'ఝుర్‌గయే పాతే, బిసర్ గయే తెహ్ని' అని కవిత అతని అత్యుత్తమ కవితలలో ఒకటిగా పరిగణిస్తారు. ఈయన అధికంగా 'మాళవ ' భాషలో కవిత్వం రాశాడు. హిందీ పాటలలో శుద్ధ హిందీ పదాలు వాడతాడు. భారతీయ సాంప్రదాయిక ప్రతీకలను అలంకారాలను వాడతాడు. గమనిస్తే, పాట పల్లవిలో పదాలన్నీ సాంప్రదాయిక ప్రతీకలే. పదాలు శుద్ధ హిందీ పదాలు. తరువర్, శాఖ్, పంఛీ, పాఖ్ వంటివి.

సినిమా కథ రాజస్థాన్‌కు చెందినది. అధికంగా ఎడారి నేపథ్యం ఉంటుంది. మండే ఎండలు, వణికించే చలి, చిక్కటి చీకటి, గాలికి ఎగిరే ఇసుక రేణువులు ఎడారిలో సాధారణం. అందుకే సంగీతం సృష్టించేందుకు జయదేవ్, సంతూర్, రేణువు, సారంగి వాయిద్యాలు మాత్రమే వాడాడు. వీటితోపాటు రాజస్థాన్‌కు మాత్రమే ప్రత్యేకమైన 'కమైచా' అన్న వాయిద్యాన్ని వినిపించాడు. ఈ వాయిద్యం వల్ల ఎడారి భావనను కలిగించవచ్చు. అంటే, పాట సందర్భాన్ని, చిత్రీకరణను, కథా నేపథ్యాన్ని, పాటలోని భావనలను ఆకళింపు చేసుకుని పాటను రూపొందించాడన్నమాట సంగీత దర్శకుడు జయదేవ్.

జయదేవ్ అత్యద్భుతమైన పాటలను రూపొందించగల శక్తి కలవాడు. 'హమ్ దోనో' సినిమాలోని 'అభీ న జావో ఛోడ్ కర్', 'మై జిందగీ క సాథ్ నిభాతా చలాగయా', 'కభీ ఖుద్ పే' వంటి పాటలు ఇందుకు తిరుగులేని నిదర్శనాలు. అయితే అతని గేయ రూపకల్పనలో బాణీ ఎంత ప్రాధాన్యం వహిస్తుందో, పాటకు ముందు, నడుమ వినిపించే సంగీతం అంతకన్నా ప్రాధాన్యం వహిస్తుంది. సంగీతం ద్వారా దృశ్యాన్ని సృష్టించటం మూడ్‌ను స్థిరపరచటం జయదేవ్‌కు వెన్నతో పెట్టిన విద్య. 'ప్రేమ్ పర్బత్' సినిమాలో 'యే దిల్ ఔర్ ఉన్ కీ' పాట ఇందుకు తిరుగులేని ఉదాహరణ.

ఈ పాటలో కూడా పరిమితమైన వాయిద్యాలతో, ఇసుక తెన్నెల్లా ఎత్తుపల్లాలతో అనూహ్యమైన మెలికలు తిరిగే బాణీతో అప్పుడప్పుడు ఎడారిలో గమనం కఠినమైనట్టూ మంద్ర గమనంతో పాటను నడుపుతూ, అప్పుడప్పుడూ వేగవంతం చేస్తూ అత్యద్భుతమైన బాణీని సృహించాడు జయదేవ్. ఈ పాటను జయదేవ్ రాజస్థాన్‌కి ప్రత్యేకమైన 'మాండ్' రాగంలో సృజించాడు. మాండ్ రాగంలో పాటకు ఆయన ఎంచుకున్న వాయిద్యాల వల్ల ఒంటరి ఎడారి, అనంతమైన ఇసుక రాశి, చిక్కటి చీకటి, నడుమ ప్రేమికులు.. ఈ దృశ్యాన్ని సంగీత స్వరాలతో చిత్రించే వీలు కలిగింది. ఈ పాట బాణీ కూడా మామూలు సినిమా పాటలకు భిన్నమైనది. పాటకు ఒక నిర్దిష్టమైన నడకలేదు. చరణం చరణానికి నడక మారుతుంది. ఆయన ఎంచుకున్నది కూడా 'దాద్రా' తాళం. ఈ తాళం కఠినమైనది. దాని నడకకు తగ్గ పదాలను ఎంచుకున్నాడు బాలకవి బైరాగి. ఇక లతామంగేష్కర్ పాట పాడిన విధానం గురించి చెప్పటం కుదరదు. అది అనుభవించాల్సిందే. ఆమె స్వర తరంగాలు, భావనామృత విహంగాలై, వాటి రెక్కలపై శ్రోత మనస్సును అనంత అంబరపు విహారం చేయిస్తాయి. తాళం ఆగటం, హఠాత్తుగా ఆరంభమవటం, ఈ సమయంలో లతా స్వరం అమృతం ధ్వనిలా మారితే ఇలాగే ఉంటుందన్న భావనను కలిగిస్తుంది. కొన్ని పదాలను ఒత్తి పలకటం, మీండ్ (దీర్ఘం), ముర్కి (గమకం), వంటి పలు అలంకారాలతో పాటను మరింత అద్భుతంగా అలంకరించింది లత తన స్వరంతో. ముఖ్యంగా, ఎడారి నేపథ్యంలో, బలహీనంగా కనిపిస్తున్న వహీదా రహెమాన్ పాత్ర మనస్సులోని భావాలు, ఆమె వదనంలో

ప్రతిఫలిస్తూండగా, వాటిని తన స్వరంలో పలికిస్తూ పాట ప్రభావాన్ని, దృశ్య శక్తిని ఇనుమడింపచేస్తుంది లత తన స్వరంతో. అయితే, తెరపై దృశ్యం చూసేకన్నా, కళ్లు మూసుకుని నిశ్శబ్ద నిశీధిలో పాట ఒక్కో 'నోట్'ను, ఒక్కో పదాన్ని, □ తా స్వరం పదా□ భావానికి ప్రాణం పోయటాన్ని అనుభవిస్తూ వింటూంటే పాట గొప్పతనం మరింత స్పష్టమవుతుంది.

నా సర్‌వర్, నా బావడీ, నా కోయీ ఠండీ ఛావ్

నా కోయల్, నా పపీహే ఐసా మేరా గాంవ్ రే

కహా బుఝే తన్ కీ తపన్, ఓ సయ్యా సిరమోర్

చంద్ర కిరణ్ కో ఛోడ్‌కర్, జాయే కహా చకోర్

జాగ్ ఉఠీ హై సాంవరే, మేరీ కుంవరీ ప్యాస్‌రే

అంగారే భీ లగ్‌నే లగే పియా ఆజ్ ముఝే మధుమాస్ రే

అందుకే ఈ పాట ఈ లోకానికి చెందినది కాదు.

సంగీతం సృజించే దృశ్యాన్ని, సాహిత్యం అక్షరాలలో ప్రదర్శిస్తోంది. దాంతో పాట ప్రభావం మరింతగా జాజ్వల్యమానం అవుతుంది.

వారుంటున్నది ఎడారి ప్రాంతం. ఆమె తన గ్రామంలో సరోవరంలేదు, చల్లటి నీడలేదు, నదుల ఒడ్డున ఉండేటటువంటి నల్లటి సారవంతమైన మట్టిలేదు, కోకిల లేదు, అందంగా కూసే పక్షిలేదు. ఈ ఎండకు మండిపోయి తాళలేని శరీరపు తపనను చల్లార్చుకునేందుకు సరస్సులున్న మహళ్లు లేవు. ఈ తపనను ఎలా చల్లార్చుకోవాలి ప్రియతమా? అని అడుగుతోంది, నాయిక నాయకుడిని.

ఇక్కడివరకూ పాట ఒక స్థాయిలో సాగుతూంటుంది. ఆమె తన గ్రామం పరిస్థితి వివరిస్తున్నట్టుంటుంది. ఇది ఆమె గ్రామం పరిస్థితి మాత్రమేకాదు, ఎడారి ప్రాంతాలలోని గ్రామాల అన్నిటి పరిస్థితీ దాదాపుగా ఇంతే. నిరంతరం మండించే ఎండ మండిస్తూంటూంది. నీరు దొరకదు. సారవంతమైన నేల ఉండదు. నదులు, సరస్సులు ఉండవు. నీరు ఉండదు.

కాబట్టి చెట్లుండవు. చెట్లుండవు కాబట్టి పక్షులుండవు. కాబట్టి ఎండకు మండే శరీర తాపాన్ని చల్లార్చుకునేందుకు ఎటు పోవాలి? అని నాయిక అడగటంలో అసంబద్ధం, ఆశ్చర్యం ఏమీలేదు.

'సర్‌మోర్' అన్న పదం చాలా చక్కనిది. 'సర్' అంటే సరస్సు. అమృత్ సర్ అంటే అమృతమయమైన సరస్సు. 'మౌర్' అంటే భవనం. 'సర్‌మౌర్' అంటే సరస్సులు కల భవనం. రాజస్థాన్‌లో ధనవంతు□కు ఇలాంటి భవంతులు సాధారణం. కానీ నాయిక ఉంటున్నది నగరం కాదు. రాజభవనం కాదు. కాబట్టి శరీరం మంటను చల్లార్చుకోవటం ఎలా? అంటున్నది. ఆమె వాడిన పదం 'సయ్యా సిర మౌర్ ' అంటే ఆమె ప్రేమికుడు శీతలంగా ఉండే సరస్సులున్న భవంతిలాంటి వాడన్నమాట. 'ఇలాంటిది నా గ్రామం' అని చెపుతూ నాయకుడిని 'సర్‌మౌర్' అనటంతోటే పాట అర్థం మారిపోతుంది.

ఇంతవరకూ ఆమె వర్ణిస్తున్నది ఆమె గ్రామాన్ని కాదు. ప్రేమ అన్నది లేని తన జీవితాన్ని. ఎలాంటి ఆశ, కోరిక లేని తన జీవితాన్ని. ఆమె జీవితంలో నీరన్నది లేక ఎండి ఎడారి అయిన ఆమె జీవితంలో సరస్సుల కల భవనంలాంటి ప్రియుడు ప్రవేశించాడు. అతి అందమైన, అద్భుతమైన గేయ రచన పద్ధతి ఇది. ఎలాగయితే, ఆమె గ్రామ వర్ణన ఎడారి ప్రాంతాలలోని అన్ని గ్రామాలకూ వర్తిస్తుందో, అలాగే, ప్రేమ రాహిత్య భావన అధికశాతం యువతీ యువకులకూ వర్తిస్తుంది.

అందుకే తరువాత పాదంలో ఆమె 'చంద్ర కిరణాన్ని వదిలి చకోరం ఎటు వెళ్తుంది?' అని అడుగుతుంది. చకోరం, చంద్రకిరణాన్ని వదలి వెళ్లలేదు. ఆమె జీవితంలో శీతల సరోవరంలాంటి వాడతడు. అతడిని వదలి ఆమె ఎటు వెళ్లగలుగుతుంది! అంతా ఎండ వేడి, చెట్టులేదు, పిట్టలేదు. ఏమీ లేని జీవితం.

అందుకే చంద్రుడిని వదలి చకోరం ఎటు వెళ్తుంది అన్న తరువాత ఆమె కన్నె మనసులో దాహం జనించింది, ఇపుడామెకు నిప్పు కణికలు కూడా మధుమాసంలా అనిపిస్తున్నాయి అంటున్నది.

ఆమె జీవితంలో అతడు ఏమిటో ఆమె అతి స్పష్టంగా చెప్తోంది. అతడు సరసన ఉంటే నిప్పు వేడి కూడా మధుమాసంలా అనిపిస్తుందట. ఇప్పుడు, వేడికి తపిస్తున్న ఆమెకు చల్లదనం అతని దగ్గరే లభిస్తుందన్నది చెప్పకనే చెప్పినట్టయింది. అంటే, అతను ఆమె జీవితంలో ప్రవేశించేంతవరకూ ఆమె జీవితం ఎడారి. అతను ఆమె జీవితంలో ప్రవేశించిన తరువాత ఎడారి వేడి కూడా మధుమాసంలా తోస్తోంది.

ఈ పాటలో మూడు చరణాలుంటాయి. మూడు చరణాలు వారి ప్రేమలోని మూడు విభిన్నమైన దశలను ప్రదర్శిస్తాయి. మొదటి చరణం ఆమె జీవితంలో అతని ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తుంది. ప్రేమ ఆమె జీవితంలో ప్రవేశించక ముందర స్థితిని ప్రదర్శిస్తుంది.

రెండవ చరణం, ప్రేమ ఆమె జీవితంలో ప్రవేశించిన తరువాత స్థితిని ప్రదర్శిస్తుంది. వారిద్దరి నడుమ ఏర్పడిన ఆత్మీయ బాంధవ్యాన్ని ప్రదర్శిస్తుంది.

తుఝే అంచల్ మే రఖూంగీ ఓ సాంవరే,

కాలీ ఆల్కోంసే బాంధూంగీ యే పాంవ్ రే

గల్ బయ్యా వో డాలూ కీ ఛూటే నహీ

మేరా సప్నా సజన్ అబ్ టూటే నహీ

మెహందీ రఖీ హథేలియా, మెరీ కాజల్ కారే నైన్ రే

పల్ పల్ తుఝే పుకార్తే పియా, హోహోకర్ బే చైన్ రే

అతడిని తన కొంగుతో కట్టేసుకుంటుంది. నల్లటి వెంట్రుకలతో అతని కాళ్లను కట్టేస్తుంది. రెండు చేతులూ మెడలో వేసుకుని బంధిస్తుంది. అది విడదీయలేని బంధం. ఇలా ఆమె కల కల్లకాకుండా కట్టుదిట్టం చేసుకుంటూంది. ఆమె చేతులకు గోరింట పెట్టుకుంది. కళ్లకు కాటుక రాసుకుంది. ప్రతిక్షణం, అనుక్షణం ఆమె ఆరాటంతో అతడిని పిలుస్తూన్నది. పిలుస్తూ మరింత ఆత్రపడుతోంది.

ప్రేమలోని తీవ్రతను, అభద్రతా భావాన్ని, తమ ప్రేమ శాశ్వతం, తమ బంధం చెదరనిది అన్న విశ్వాసం, అలా ఉండాలన్న కోరిక, తపనలను అతి సున్నితంగా, అత్యద్భుతంగా దశలవారీగా వర్ణించాడు కవి. కొంగుతో కట్టేసుకోవటం ఆకర్షణ ద్వారా బంధించటం. కాళ్లను వెంట్రుకలతో బంధించటం అంటే బ్రతిమిలాడి, బుజ్జగించి కట్టేసుకోవటం. మెడలో చేతులు వేసి బంధించటం కౌగిలింతద్వారా, అంటే, అతి సన్నిహితమైన బంధనంతో బంధించటం. అతనిపై హక్కును సాధించటం ఇది ఆమె కల. ఆ కల చెదిరిపోవద్దంటోంది. ఆపై వివాహ సమయంలోలాగా గోరింటాకు, పెట్టుకుని, అలంకరించుకుని ఆరాటంగా, అతడిని పిలుస్తూనే ఉందామె. అంటే, అతడి దూరాన్ని సహించలేకపోతోందన్నమాట.

అతడిని వివాహం చేసుకోవాలని, జీవితం అతడితో గడపాలని, అతడి ఎడబాటును క్షణమైనా సహించలేదని ఆమె అతడికి స్పష్టం చేస్తోంది.

మూడవ చరణంలో వారిద్దరూ కలుస్తారు. ఈ చరణంలో భావాలను వ్యక్తపరచేందుకు బాలకవి బైరాగి వాడిన పదాలు అమోఘం. హిందీ సినీ గీతాలలో అరుదుగా వినపడే పదాలు, అసలు వినబడని పదాలు ఈ చరణంలో పొందు పరచి అత్యంత సుందరమైన దృశ్యాన్ని చిత్రించాడు బాలకవి బైరాగి.

ఓ మేరే సావన్ సజన్, ఓ మేరీ సిందూర్

సాజన్ సంగ్ సజనీ బనీ మౌసం సంగ్ మయూర్

చార్ పహర్ కె చాంద్‌నీ మేరే సంగ్ బితా

అప్నే హాథోంసే పియా మోహెలాల్ చునర్ ఓఢా

కేసరియా ధర్తీలగే, అంబర్ లాలం – లాల్ రే

అంగ్ లగాకర్ సాయబా, కర్ దే ముఝే నిహాల్ రే...

నాయిక నాయకుడిని సంబోధించిన పదాలు ఎంత ఔచితీవంతం అంటే ఒకో పదాన్ని లత పలుకుతూంటే, కాలం స్థంభించి ఆ పదం పదే పదే చెవుల్లో వినిపిస్తూంటే, ఆనందం ఆర్ణవమనటమంటే ఏమిటో బోధపడుతుంది.

ఆమె అతడిని 'సావన్ సజన్' అంటుంది. 'సజన్' అన్నది హిందీ సినిమా పాటలలో సాధారణం. ప్రియుడు అన్న అర్థం. 'సావన్' అంటే వర్షాకాలం. వర్షం. 'సావన్ సజన్' అంటే వర్షాకాలంలాంటి ప్రియుడు. వర్షంలాంటి ప్రియుడు అన్న అర్థాలు వస్తాయి. ఎడారిలాంటి ఆమె జీవితంలో వర్షాకాలం లాంటి వాడితడు. అదీ ఎల్లప్పటికీ ఉండే వర్షాకాలం. అంటే ఇక ఆమె జీవితం నీరులేని ఎడారి కాదన్నమాట. నీటితో నిండిన నందనవనం అన్నమాట. ఎడారి ప్రాంతాలలో నివసించేవారికి నిరంతరం నీరు లభించటం ఒక 'కల'. అన్నిటికన్నా విలువైనది అది.

అతడిని 'ఓ మేరే సిందూర్' అంటోంది. ఇంతకు ముందేమో కానీ ఇప్పుడు 'సిందూర్' ప్రాధాన్యం, భారతీయ మహిళలకు 'సిందూర్ ' ఎంత పవిత్రమో చెప్పనవసరంలేదు. అతడిని ఆమె తన 'సిందూరం' అవటంతోటి వారిద్దరి

నడుమ ఉన్న బంధం తెలిసిపోతుంది. .వర్షానికీ మయూరానికీ విడదీయరాని సంబంధం ఉన్నట్టే, ప్రేయసికీ, ప్రియుడికీ నడుమ సంబంధం ఏర్పడింది అంటోంది.

ఈ సందర్భంలో 'మౌసం సంగ్ మయూర్' అన్న పదబంధం వాడాడు కవి.

'మౌసం' అంటే ఋతువు, వర్షం అన్న అర్థాలు వస్తాయి. 'మయూర్'అంటే నెమలి, వర్షాకాలపు మేఘం కనిపిస్తే, చల్లగాలి వీస్తే మయూరం నృత్యం చేస్తుందంటారు. అతడు 'సావన్ సజన్' కాబట్టి వర్షపు మేఘాలకు కొదవలేదు. ఆమె హృదయం నృత్యం చేయటానికి అడ్డులేదు. వారిద్దరి నడుమ అలాంటి అన్యోన్య సంబంధం ఏర్పడింది.

రాజస్థాన్ జానపద గీతాల్లో 'తేజ్‌గీత్' అన్న గీతాలున్నాయి. వర్షాకాలంలో నృత్యాలు చేస్తూ ఈ పాటలు పాడతారు. వీటిల్లో మయూర నృత్యగీతాలు అనేకం ఉన్నాయి. 'మౌసం సంగ్ మయూర్' అనటంలో రాజస్థాన్‌లో ఆనందంగా నృత్యం చేస్తూ పాటలు పాడే ఈ గీతాల సూచన ఉంది. అత్యంత సంతోషంగా గడిపే సమయం ఇది. ప్రియుడితో ఇలా అత్యంత ఆనందంగా గడిపే సంబంధం ఏర్పడిందని నాయిక అంటోంది.

ప్రియుడు ఆమెతోనే ఉంటాడు ఎల్లప్పటికీ కాబట్టి వెన్నెల ఎల్లప్పటికీ ఆమెతోనే ఉంటుంది. తన చేతులతో ప్రియుడిని ఎర్రటి వస్త్రం తలపై నుంచి కప్పమంటోంది. రాజస్థాన్‌లో వివాహ సమయంలో ఎర్రటి దుస్తులు వేసుకుంటారు వధువులు. వారి తలపై 'లాల్ చునర్' కప్పుతారు. నా తలపై ఎర్రటి వస్త్రం కప్పమనటం వివాహాన్ని సూచిస్తుంది. ఎర్రటి వస్త్రం కప్పటంతోటే భూమి కాషాయమయం అయిపోయింది. ఆకాశం ఎరుపెరుపు రంగుతో నిండింది. 'కేసరియా ధర్తీలగే, అంబర్ లాలం – లాల్ ' అద్భుతమైన పదాలు. 'కేసరియా'. ఈ భూమి కాషాయ రంగులో కనిపించటం అంటే, భూమి పవిత్రమైనట్టు, అందంగా, ఆరోగ్యంగా ఉన్నట్టూ. రాజస్థాన్‌లో 'కేసరియా బాలమా' అంటారు ప్రియుడిని. తనని దగ్గర తీసుకుని తన జీవితాన్ని ధన్యం చేయమని అడుగుతోంది.

మూడవ చరణం పూర్తిగా వివాహం, వారిద్దరూ ఏకమవటం, జీవితాన్ని ధన్యం చేసుకోవటంవంటి వాటిని ప్రదర్శిస్తుంది. ఇలా మూడు చరణాల్లో ఒక సంపూర్ణ జీవితాన్ని ప్రదర్శించాడు బాల కవి బైరాగ్.

ఇది వారిద్దరూ వివాహం చేసుకుని వారి ప్రేమ ఫలవంతమైనప్పటి స్థితి. కానీ సినిమాలో చివరలో నాయిక తనకు దక్కదని గ్రహించిన నాయకుడు కత్తితో పొడుచుకుని చచ్చిపోతాడు. అది చూసిన నాయిక గుండె ఆగి చచ్చిపోతుంది

అతనిపై పడి. ఇప్పుడు రక్తం ఎరుపు రంగు. చివరి చరణంలో వర్ణించిన ఎఱ్రటి వస్త్రం కప్పటం, భూమి కాషాయ రంగులో కనబడటం, ఆకాశం ఎరుపెరుపెక్కటం, అంతా మరో అర్థాన్నిస్తాయి.

ఈ పాటకు జయదేవ్‌కు జాతీయ స్థాయిలో అవార్డు వచ్చింది. ఈ పాటను ఈ నాటికీ అత్యుత్తమ గేయ రచనగా కల గీతంగా పరిగణిస్తారు. ఇప్పటికీ ఈ పాటను విశ్లేషిస్తూ సామాన్యులు, పండితులేకాదు, సంగీత విద్వాంసులు కూడా మైమరచిపోతారు. ఈ పాటలో బాలకవి బైరాగీ సంపూర్ణంగా శుద్ధ హిందీ పదాలు, స్థానికంగా ప్రచారంలో ఉన్న హిందీ పదాలను మాత్రమే వాడాడు. చివరలో వాడిన 'నిహాల్' పదం అరబ్బీ భాషలోనూ ఉన్నా, 'పంజాబీ' పదం కూడా అది. బాలకవి బైరాగీ ఈ పాటలో 'నిహాల్' పదాన్ని పంజాబీ భాషలోని అర్థంలో వాడేడు. 'నిహాల్' అంటే blessed అన్న అర్థం ఉంది. 'బోలే సో నిహాల్, సత్ శ్రీ అకాల్' అంటారు పంజాబీలు. సత్ శ్రీ అకాల్ అంటే 'భగవంతుడు సత్యం' అని పలికేవారికి భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయి అని అర్థం. 'అంగ్ లగాకర్ సాయిబా, కర్ దే ముఝే నిహాల్' అంటుంది నాయిక.

ఒక్కో పదాన్ని ఎంచుకుని, తూచి, చెక్కి, మెరిసేట్టు చేసి వజ్రం పొదిగినట్టు బాణీలో పొదిగాడు బాలకవి బైరాగి అనిపిస్తుందీ పాట వింటూంటే. అందుకే ఎన్నిసార్లు విన్నా తనివి తీరదు. విన్న కొద్దీ ఇంకా వినాలనిపిస్తుంది. సేవిస్తూంటే అమృతమన్నా విసుగు వస్తుందేమో కానీ ఇలాంటి గీతామృతం వెగటు రాదు సరికదా, మరింత ప్రియమౌతూ, ఇంకా ఇంకా వినాలనిపిస్తుంది. అందుకే ఆనాటి కళాకారులు పొరపాటున గంధర్వలోకం వదలి మానవలోకం చేరి, మానవులలోని దైవత్వ భావనను జాగృతం చేసేందుకు దేవలోక సంగీతాన్ని, గీతాలను ఇక్కడ వదిలి వెళ్లిపోయారనిపిస్తుంది.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story